
రామారావు మహరాజ్‌కు..
రామారావు మహరాజ్‌కు భారతరత్న ప్రకటించేలా కృషి చేస్తానని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు.
- 8లో ▸


భద్రత ఎవరి బాధ్యత?
గోదావరిలో పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తుల ప్రాణాలకు భద్రత కరువైంది. అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.2/20.8
వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

న్యాయసేవ సంస్థకు చేయూత అందిస్తాం



ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయవిజ్ఞాన సదస్సులు, సామాజిక చైతన్య కార్యక్రమాలకు చేయూత అందిస్తామని హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సామ్ కోషి, హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్రీసుధ, జస్టిస్ తుకారాంజీ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జస్టిస్ సామ్ కోషి నివాసంలో సహచర హైకోర్టు న్యాయమూర్తులు శ్రీసుధ, తుకారాంజీతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాలకు ప్రశంసపత్రం అందజేశారు. నిజామాబాద్‌లో మార్చి 3న 11 వేల మందితో నిర్వహించిన తైక్వాండో ప్రదర్శన సంస్థ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్, సుమలత, భరత్, లక్ష్మణ్, నాగేందర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సంబురాలు



ఖలీల్‌వాడి: ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ప్రకటించడంతో నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ ఉద్యోగులు శనివారం సంబురాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని డిపో- 1 వద్ద స్వీట్లు పంపిణీ చేసి, టపాసులు కాల్చారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ సజ్జనార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జెడ్ఆర్‌యూసీసీ సభ్యుడిగా జనార్దన్‌రావు



కామారెడ్డి అర్బన్: సౌత్ సెంట్రల్ రైల్వే జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(జెడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా దేవునిపల్లికి చెందిన పోలీసు జనార్దన్‌రావు నియమితులయ్యారు. ఆయన 2025 జనవరి వరకు సభ్యుడిగా కొనసాగనున్నారు. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే డీజీఎం శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం జిల్లాకేంద్రంలోని శ్రీకృష్ణధ్యాన మందిరలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు వురు జనార్దన్‌రావును అభినందించారు.

నూతన విద్యా విధానాన్ని అమలు చేయొద్దు



తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర ప్రభుత్వం శాస్త్రీయ ఆలోచన లేని నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి విద్యారంగాన్ని ధ్వంసం చేయాలని చూస్తోందని ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వరరావు విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయవద్దని డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కాలేజీ సెమినార్ హాల్‌లో శనివారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వెన్షన్ ప్రారంభమైంది. ముఖ్యవక్తగా హాజరైన ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై పోరాటాలకు ఈ కన్వెన్షన్ ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేస్తామన్నారు. అంతకు ముందు ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్‌మూర్తి ఆవిష్కరించారు. ఐటీఐ మాజీ ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రావు, రమేష్‌బాబు, మమత, నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ విగ్నేష్, బోడ అనిల్, కామారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ్, అజయ్, భరత్, రవినాయక్, ప్రసాద్, సంధ్య రెడ్డి, దీపిక తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు



- పగలు భానుడి ప్రతాపం.. రాత్రి చలి తీవ్రత
- అత్యధికంగా మెండోరాలో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. తెలంగాణలోనే అత్యధికంగా మెండోరాలో 39.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సీజన్‌లో జిల్లాలోనూ ఇదే అత్యధికం. ఈ వేసవిలో మునుపెన్నడూ లేని విధంగా చరిత్రలోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మార్చి రెండో వారంలోనే 40 డిగ్రీలకు చేరుకుంటే.. ఏప్రిల్ చివరి వారం, మే నెలలో పగటి ఉష్ణోగ్రతలు 50 డిగ్రీలు చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. అదే సమయంలో రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతున్నాయి. వేకువజామున స్వల్పంగా మంచు పడుతూ చలి పెడుతోంది. శనివారం నగటు ఉష్ణోగ్రతలు 37.2(గరిష్టం), 20.8(కనిష్టం) డిగ్రీలుగా నమోదైంది. ఎండ వేడికి ప్రజలు మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దీంతో రోడ్లపై జన సందడి తగ్గింది. దుకాణాలు పగటిపూట బంద్ చేసి సాయంత్రం వేళ తెరుస్తున్నారు.

– సుభాష్‌నగర్

జిల్లాలో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	కనిష్టం	గరిష్టం
మెండోరా	18.6	39.7
ఎడపల్లి	19.2	39.5
మోస్రా	18.0	39.4
వేల్పూర్	19.0	39.2
నిజామాబాద్ నార్త్	19.3	39.1
ముప్కాల్	19.9	38.0
బోధన్	18.0	38.0
మోర్తాడ్	18.5	37.9
బాల్కొండ	19.1	37.8
జక్రాన్‌పల్లి	19.8	37.6
ఏర్గట్ల	18.5	37.5
కమ్మర్‌పల్లి	20.0	37.4
ఆర్మూర్	18.4	37.2
ఎడపల్లి	19.2	36.9
భీమ్‌గల్	19.0	36.8
నిజామాబాద్ రూరల్	19.1	36.7
డిచ్‌పల్లి	19.7	36.6
వర్ని	24.0	35.8
సిరికొండ	19.4	35.7

పకడ్బందీగా పది పరీక్షలు



జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 30 వరకు పరీక్షలు జరగనున్నాయి. దీనికి సంబంధించి జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో వెల్లడించారు.

– నిజామాబాద్‌అర్బన్

- జిల్లాలో 140 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 21,893 మంది విద్యార్థులు
- సాక్షి ఇంటర్వ్యూలో డీఈవో దుర్గాప్రసాద్

ప్రశ్న: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు చేశారా.

జవాబు: పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ నెల 18 నుంచి పరీక్షలు జరగున్నాయి. జిల్లాలో 140 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఆయా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం. ఎక్కడ కూడా మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు చేపట్టాం. ఇన్విజిలేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించాం.

కాపీయింగ్ నిరోధానికి..

మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. ప్రతి సెంటర్‌లో సీసీ కెమెరాలు అమర్చాం. పరీక్ష నిర్వహణ సిబ్బంది అధికారులకు శిక్షణ ఇచ్చాం. కాపీయింగ్ నిరోధానికి ప్రత్యేక బృందాలు ఉన్నాయి. మాస్‌కాపీయింగ్ జరిగితే సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లపై చర్యలు తీసుకుంటాం. పరీక్ష కేంద్రంలోకి ఎవరు కూడా సెల్‌ఫోన్లు తీసుకురాకుడదు. విద్యార్థులను తనిఖీ చేసి సెంటర్‌లోకి అనుమతిస్తాం. ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురావొద్దు.

వేసవి కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు.

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరీక్ష కేంద్రంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాం. మంచి నీరు, ఫ్యాన్లు, కరెంటు సదుపాయం ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. వేడికి ఇబ్బంది పడకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

ఈ ఏడాది పరీక్షల నిర్వహణలో కొత్త నిబంధనలు ఉన్నాయా.

ఈ సారి సైన్స్ సబ్జెక్టుకు సంబంధించి రెండు పేపర్లు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 26న ఫిజిక్స్, 28న బయోలాజీ పరీక్ష ఉంటాయి.

హాల్‌టికెట్‌పై తప్పులు ఉంటే..

హాల్‌టికెట్లపై చిన్నచిన్న తప్పులు ఉన్నా పరీక్షలకు అనుమతిస్తాం. అక్కడ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పరిశీలిస్తారు. ప్రస్తుతం హాల్ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలు, స్థానిక ఎంఈవోలు ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేస్తారు.

నిమిషం నిబంధన అమలు చేస్తున్నారా.

ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. నిమిషం నిబంధన అమలు చేయడం లేదు. విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. విద్యార్థులు సమయపాలన పాటించాలి.

జిల్లాలో పదో తరగతి పరీక్షల వివరాలు

మొత్తం విద్యార్థులు	21,893
బాలికలు	10,735
బాలురు	11,158
పరీక్ష కేంద్రాలు	140
చీఫ్ సూపరింటెండెంట్లు	140
డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు	140
ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు	07
సిట్టింగ్ స్క్వాడ్‌లు	141

జొన్నలు కొంటలేరు!

- డిమాండ్ లేదంటూ కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
- రైతుల వద్ద పేరుకుపోతున్న నిల్వలు

మోర్తాడ్: మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన బద్దం రాజశేఖర్ తన పొలంలో పండిన 50 క్వింటాళ్ల ఎర్రజొన్నలను అమ్ముకోవడానికి చూడగా.. వ్యాపారులు వారం రోజుల నుంచి దాట వేస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తెల్ల, ఎర్ర, ముళ్ల జొన్నలకు డిమాండ్ తగ్గిపోయిందని అక్కడి వ్యాపారులు తాము పంపించే లారీ లోడ్‌లను తీసుకోవడం లేదని ఇక్కడి సీడ్ వ్యాపారులు సదరు రైతుకు చెప్పారు. ఇది ఒక్క రైతు రాజశేఖర్ సమస్యనే కాదు.. ఈ సీజనుకు గాను మూడు రకాల జొన్నలను సాగు చేసిన రైతులకు ఎదురైన గడ్డు పరిస్థితి. జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలలో ఈ సీజనులో దాదాపు 25వేల ఎకరాల్లో మూడు రకాల జొన్నలను సాగు చేశారు. పంట చేతికి వచ్చిన సమయంలో ఏ రకానికైనా క్వింటాల్‌కు రూ.4వేల వరకు ధర పలికింది. కొన్ని సందర్భాల్లో వ్యాపారులు ధర తగ్గించగా అధికారులు జోక్యం చేసుకుని క్వింటాలుకు రూ.3,500కు తగ్గకుండా చూడాలని ఆదేశించారు. ఎర్రజొన్నలను రూ.3,500నుంచి రూ.3,700 వరకు, ముళ్ల జొన్నలను రూ.4వేల వరకు, తెల్లజొన్నలను రూ.3,200 నుంచి రూ.3,300 ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు.



సుంకెట్ శివారులో ఆరబోసిన ఎర్రజొన్నలు

వారం నుంచి..

వారం రోజుల నుంచి జొన్న కొనుగోళ్లను నిలిపివేయడంతో రైతుల వద్దనే పంట నిల్వలు పేరుకుపోతున్నాయి. 60 శాతం పంట కొనుగోళ్లు పూర్తవగా మరో 40 శాతం రైతుల వద్ద ఉన్నాయి. డిమాండ్ లేదనే కారణంతో సీడ్ వ్యాపారులు పంటను కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో అమ్మకాలు లేకుంటే తాము కొనుగోలు చేసినా ప్రయోజనం లేదని సీడ్ వ్యాపారులు చెబుతున్నారు. గతంలో ధర తగ్గించినా కొనుగోళ్లను మాత్రం ఆపేవారు కాదని ఈసారి మాత్రమే వ్యాపారులు భిన్నంగా వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. సీడ్ ఇచ్చిన వ్యాపారులే బైబ్యాక్ ఒప్పందం ప్రకారం ధర నిర్ణయం, పంట కొనుగోలుకు ఒప్పందాలు చేసుకోవాలని వ్యవసాయ శాఖ మొదట్లోనే సూచించింది. ఎలాగైనా వ్యాపారులు కొనుగోలు చేస్తారనే ఉద్దేశంతో రైతులు బైబ్యాక్ ఒప్పందం విషయంలో కొంత అలసత్వం వహించారు. ఇప్పుడు ఎలాంటి ఒప్పందాలు లేకపోవడంతో రైతులు పంట కొనుగోలుకు సంబంధించి వ్యాపారులపై ఒత్తిడి చేయలేకపోతున్నారు.

అల్లుడిని కాపాడి.. కొడుకును కోల్పోయి..

- గోదావరిలో మునిగి యువకుడి మృతితో గుత్ప ఒడ్డెర కాలనీలో విషాదం




మక్కల మహేశ్ (ఫైల్).. గోదావరి వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ వద్ద శనివారం గోదావరి నదిలో మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనలో నలుగురు స్నానానికి నీటిలోకి దిగారు. నీటిలో కొట్టుకుపోతున్న మేనల్లుడిని కాపాడి, తన కొడుకును రక్షించుకోలేకపోయిన తండ్రి విషాదాంతం నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి శివారులోని గుత్ప ఒడ్డెర కాలనీకి చెందిన మక్కల రెడ్డి, దండుగుల బాలయ్య బావబామ్మర్దులు. మక్కల రెడ్డి అక్కను బాలయ్యకు ఇచ్చారు. శివరాత్రి నేపథ్యంలో ఇరు కుటుంబాల వారు పోచంపాడ్‌లోని శివాలయానికి వచ్చారు. ముందుగా బాలయ్య, ఆయన కుమారుడు శ్రీనివాస్, మక్కల రెడ్డి, ఆయన కుమారుడు మహేశ్ (25) స్నానమాచరించడానికి గోదావరిలోకి దిగారు. నీటిలోకి దిగగానే మహేశ్, శ్రీనివాస్ నీటిలో మునిగిపోయారు. గమనించిన మక్కల రెడ్డి వెంటనే తన మేనల్లుడు శ్రీనివాస్‌ను రక్షించి ఒడ్డుకు చేర్చాడు. అప్పటికే ఆయన కుమారుడు మహేశ్ నీటిలో ము నిగి పోయాడు. సమాచారం అందుకున్న పోలీసు లు ఘటనా స్థలికి చేరుకున్నారు. స్థానిక గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ప్రాణాలకు తెగించి మేనల్లుడిని కాపాడినా, తన కుమారుడిని రక్షించుకోలేకపోయానని మక్కల రెడ్డి కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు స్థానికులకు కలచివేసింది. యువకుడి మృతితో ఒడ్డెర కాలనీలో విషాదం నెలకొంది.

కాశీకి సేవల విస్తరణ!

- పదేళ్లుగా ట్రస్ట్ ద్వారా వివిధ జిల్లాల్లో సేవలందిస్తున్న జ్ఞానేందర్‌గుప్తా
- తాజాగా వారణాసిలో అందించడానికి స్వర్గరథం తయారీ
- స్వర్గరథానికి ఇందూరులో పూజలు చేసిన విద్యారణ్య భారతి స్వామి

సండే స్పెషల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాశీలో జీవితాన్ని ముగించాలనేది ఎంతోమంది హిందువుల కల. అక్కడ మరణిస్తే మళ్లీ జన్మ ఉండదని నమ్ముతారు. చాలామంది తమ ఆఖరి మజిలీ కోసం వారణాసి వెళ్తారు. దీంతో అక్కడ చనిపోయిన వారి మృతదేహాల తరలింపు కోసం స్వర్గరథ సేవలు ప్రారంభించనున్నారు ఇందూరుకు చెందిన మంచాల శంకరయ్య గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంచాల జ్ఞానేందర్ గుప్తా. ఉత్తరప్రదేశ్‌లోని కాశీలో అంతిమయాత్రల కోసం ఉచితంగా స్వర్గరథాన్ని మరో మూడు రోజుల్లో ప్రారంభించనున్నారు. ఈ రథాన్ని కాశీ మోక్ష యాత్ర ట్రస్ట్‌కు అప్పగించనున్నారు. వారణాసి వీధులకు తగినవిధంగా మహారాష్ట్రలోని ఔరంగబాద్‌లో దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేయించారు. ఈ రథానికి ఇందూరులో ఈ నెల 2న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి పూజలు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు.

భగవద్గీత పంపిణీ

ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలనే లక్ష్యంతో 2014 నుంచి ఆ గ్రంథాలను ఉచితంగా పంచుతున్నారు. ఐదు వేలకు పైగా తెలుగు, హిందీ, ఆంగ్లం, మరాఠా భాషల భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. వందల సంఖ్యలో రామకోటి పుస్తకాలు పంపిణీ చేశారు.

పర్యావరణంపై ప్రేమతో..

పర్యావరణ పరిరక్షణ కోసం జ్ఞానేందర్‌గుప్తా 2013 నుంచి వినాయక మట్టి ప్రతిమలను నిజామాబాద్‌లో పంచుతున్నారు. 2019 నుంచి మొక్కలు నాటే కార్యక్రమం చేస్తున్నారు. ఇప్పటివరకు 40 వేల మొక్కలు నాటించారు. పక్షులకు ఆహారం అందించేందుకు రెండు వేల బాక్సులు పంపిణీ చేశారు. అయ్యప్ప పడిపూజకు ఉచితంగా మండపాలు వేయించారు.

విద్యార్థినుల కోసం..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల బాలికలకు నెలసరి ప్యాడ్లు ఉచితంగా పంపిణీ చేసేందుకు మంచాల చర్యలు చేపట్టారు. ఇందు కోసం త్వరలో తయారీ ప్లాంట్‌ను నిజామాబాద్‌లో నెలకొల్పేందుకు ప్రణాళికలు తయారు చేసుకున్నారు. జ్ఞానేందర్ గుప్తా చేస్తున్న సేవలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 300కు పైగా అవార్డులు, ప్రశంసలు వచ్చాయి. లిమ్కా బుక్‌లో స్థానం సంపాదించారు. యూఎస్‌ఏలోని కాలిఫోర్నియా బర్కిలీ యూనివర్శిటీ నుంచి తన సేవలకు గాను డాక్టరేట్ పొందారు. మంచాల శంకరయ్య ఛారిటబుల్ ట్రస్ట్‌కు ఐఎస్‌వో అవార్డు దక్కింది.



పేదరికం నుంచి ఎదిగి..

సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం కనగర్తిలో పుట్టిన జ్ఞానేందర్ గుప్తా కటిక పేదరికం అనుభవించారు. దుకాణంలో గుమస్తాగా పనిచేసిన జ్ఞానేందర్ పౌల్ట్రీ రంగంలోకి వచ్చి అంచెలంచెలుగా ఎదిగారు. 2012లో శబరి మల వెళ్తున్న సమయంలో బెంగళూరు వద్ద ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు చందాలు వేసుకున్న ఘటనను చూసిన జ్ఞానేందర్ 2013 అక్టోబర్ 19న ఉచిత స్వర్గరథ సేవలను నిజామాబాద్‌లో ప్రారంభించారు. తండ్రి మంచాల శంకరయ్య గుప్తా ఛారిటబుల్ ట్రస్ట్ పేరుతో సేవలు మొదలుపెట్టారు. తర్వాత సొంతూరు కనగర్తి, సిరిసిల్ల, వేములవాడ, హైదరాబాద్, సికింద్రాబాద్, బోధన్, బాన్సువాడల్లో స్వర్గరథాలు ఏర్పాటు చేసి ఉచిత సేవలు అందిస్తున్నారు. 2015 ఏప్రిల్ 11 నుంచి ఫ్రీజర్ బాక్సులను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నారు. పేదలకు అవసరమైతే 50 మందికి భోజనాలు, అంతిమ సంస్కార సామగ్రి అందిస్తూ వస్తున్నారు.

కాశీ నుంచి వచ్చిన వారు అడగడంతో..



వారణాసి నుంచి వచ్చిన కాశీ మోక్ష యాత్ర ట్రస్ట్ సభ్యులు నిజామాబాద్‌కు వచ్చినప్పుడు స్వర్గ రథా ల సేవలను చూశారు. కాశీలోనూ ఏర్పాటు చేయాలని అడిగారు. దీంతో ఇందుకు పూనుకున్నాను. మరో రెండు మూడు రథాలను కాశీలో ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. సేవా కార్యక్రమాలు, వ్యాపారం విషయంలో నా సతీమణి శ్రీలక్ష్మి సహకారం మరువలేనిది.

– మంచాల జ్ఞానేందర్‌గుప్తా

సాగర్ కాలువలో ముగ్గురు గల్లంతు


నారాయణ


విజయ్


విష్ణువర్ధన్


గాలిస్తున్న చందూర్ గ్రామస్తులు

వర్ని: వర్ని పోలీస్ స్టేషన్ పరిధి అఫంది ఫారం, చందూర్ గ్రామ శివార్లలో నిజాంసాగర్ కాలువలో పడి ముగ్గురు వ్యక్తులు గల్లంతయ్యారు. వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం అఫంది ఫారానికి చెందిన నారాయణ, విజయ్ స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో కొట్టుకుపోయారు. అదేవిధంగా పక్కనే ఉన్న చందూరు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ కూడా కాలువలో పడి గల్లంతయ్యాడు. గల్లంతైన వారిలో నారాయణ, విజయ్ వ్యవసాయం చేస్తారు. విజయ్‌కి కుమారుడు, కుమార్తె ఉన్నారు. నారాయణ అవివాహితుడు. విష్ణువర్ధన్ నిజామాబాద్ ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు హెల్పర్‌గా పనిచేస్తాడు. విష్ణువర్ధన్ తల్లి పద్మతో కలిసి చందూరులో నివాసం ఉంటున్నాడు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ప్రణాళికతో చదవాలి



భిక్కనూరు : పదో తరగతి పరీక్షలకు ప్రణాళిక రూపొందించుకుని, దానికి అనుగుణంగా చదువుకోవాలని మోటివేటర్‌ గాలి నరేందర్‌ అన్నారు. ఏఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో విజయస్ఫూర్తి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేటర్‌ మాట్లాడుతూ సమయం ఎంతో విలువైనదని, వృథా చేయవద్దన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌ నర్సింహారెడ్డి, ఏఎస్‌ఆర్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ అయ్యాల సంతోష్‌, ఉపాధ్యాయులు నరసింహ, శ్రీనివాస్‌, సాయన్న, మొయినొద్దీన్‌, రమాదేవి, శంకర్‌ రావ్‌, రంగారావ్‌, చంద్రాకాంత్‌, డాక్టర్‌ సత్యం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌ చాలీసా పారాయణం

కామారెడ్డి అర్బన్‌ : కామారెడ్డి గంజ్‌ వర్తక సంఘ భవనంలోని హనుమాన్‌ ఆలయంలో శనివారం సందర్భంగా సామూహిక హనుమాన్‌ చాలీసా పారాయణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి శనివారం ఉదయం 8 గంటల నుంచి అరగంట పాటు జరిగే సామూహిక హనుమాన్‌ చాలీసా కార్యక్రమంలో పాల్గొనవచ్చని ప్రతినిధి యెల్లంకి సుదర్శన్‌ అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్‌



కామారెడ్డి టౌన్‌ : కామారెడ్డి మున్సిపల్‌లోని మరో బీఆర్‌ఎస్‌ కౌన్సిలర్‌ ఆ పార్టీకి రాజీనామా చేసారు. శనివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ సమక్షంలో 20వ వార్డు మహిళా కౌన్సిలర్‌ తయ్యబా సుల్తానా కాంగ్రెస్‌ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో కాంగ్రెస్‌ సభ్యుల సంఖ్య 26కు చేరుకుంది. త్వరలోనే బీఆర్‌ఎస్‌ చైర్‌పర్సన్‌ అవిశ్వాసం పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్‌ శ్రీనివాస్‌రావు, నాయకులు గడ్డం చంద్రశేకర్‌రెడ్డి, సలీం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే..



పెద్దకొడప్‌గల్‌(జుక్కల్‌) : మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని ఏఎస్సై రాములు హెచ్చరించారు. శనివారం మండలంలోని బేగంపూర్‌ గ్రామ చౌరాస్తలో డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్సై రాములు మాట్లాడుతూ వాహన ధృవీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపేవారు. 18 ఏళ్ల పైబడి డ్రైవింగ్‌ లైసెన్స్‌ ఉంటేనే వాహనాలు నడపాలని తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు లేదా వాహన యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌ సిబ్బంది రవి, రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

భద్రత.. ఎవరి బాధ్యత?

పుష్కర ఘాట్లలో మృత్యుఘోష
- 2021లో ఆరుగురు మృతి
- పుణ్యస్నానానికి వచ్చి శుక్రవారం ముగ్గురు.. శనివారం మరొకరు

పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చే వారి ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. భద్రత కల్పించాల్సిన బాధ్యత ఎవరిదని ప్రశ్నిస్తే.. ప్రాజెక్టు అధికారులు, గ్రామ పంచాయతీ, దేవాదాయశాఖ ఒకరివైపు మరొకరు వేలెత్తి చూపే పరిస్థితి ఉంది. ఓ వైపు ఎవరికి వారు తప్పించుకునే ప్రయత్నాలు చేస్తుండగా.. మరోవైపు ప్రాణాలు గోదావరిలో కలుస్తున్నాయి.



శనివారం గోదావరిలో మునిగి మృతి చెందిన మక్కల మహేశ్‌



2021సంవత్సరంలో మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బాల్కొండ: గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ ప్రాంతానికి వస్తున్న భక్తుల ప్రాణాలకు భద్రత కరువైంది. పుష్కర ఘాట్లలో భక్తుల ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పుణ్యస్నానానికి వచ్చిన ముగ్గురు ప్రాజెక్టులో మునిగి శుక్రవారం మృతి చెందిన ఘటన మరువకముందే శనివారం మరొకరు మృతి చెందారు. మాక్లూర్‌ మండలం గుత్పకు చెందిన మక్కల మహేశ్‌ కుటుంబ సభ్యులతో కలిసి మెండోరా మండలం పోచంపాడ్‌ వద్ద గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తుండగా, మహేశ్‌తో పాటు మరొకరు గల్లంతయ్యారు. కుటుంబ సభ్యులు ఒకరిని కాపాడగా, మహేశ్‌ మృతి చెందాడు. ఇలా ప్రతి సంవత్సరం ఒకరు లేదా ఇద్దరు పుష్కర ఘాట్‌ల వద్ద పుణ్యా స్నానాలకు వచ్చి కానరాని లోకాలకు పోతున్నారు. అయినప్పటికీ అధికారులు ఎలాంటి భద్రతాచర్యలు చేపట్టడం లేదు. గోదావరి పక్కనే ఉన్న శివాలయం, రామాలయం దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్నాయి. భక్తుల ముక్కుపిండి టికెట్ల రుసుం వసూలు చేసే సంబంధిత అధికారులు.. భక్తుల భద్రతది కాదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా, అసలు ఎస్సారెస్పీకే భద్రత లేనప్పుడు పర్యాటకులకు, భక్తులకు ఇంకా ఎక్కడ ఉంటుందని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పుష్కరఘాట్‌లతోపాటు ప్రాజెక్టులో, వరద గేట్ల ముందు గోదావరిలో మునిగి ప్రాణాలు పోతున్నా అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కనిపించని రక్షణ చర్యలు



శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ దిగువన వీఐపీ పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తూ 2021లో ఆరుగురు జలసమాధి అయ్యారు. మృతుల్లో ఇద్దరు పెద్దలు, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ విషాద ఘటనతో స్పందించిన అప్పటి పాలకులు.. జాలీలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రతి సోమ, శుక్రవారాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామని ప్రకటనలు చేశారు. కానీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. ఆరుగురు మృతి చెందిన మూడేళ్లయినప్పటికీ ఇప్పటి వరకు కనీస చర్యలు చేపట్టలేదు. గోదావరికి వచ్చే భక్తులు నది లోతు అంతుపట్టక పోవడంతో మునిగి గంగపాలవుతున్నారు. గతేడాది ఆర్మూర్‌కు చెందిన ఇద్దరు భక్తులు నీట మునిగి మృతి చెందారు. ఎస్సారెస్పీ వద్ద మూడు పుష్కర ఘాట్‌లు ఉండగా.. మూడింటి వద్ద ఎలాంటి రక్షణ లేదు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

- గన్యాతండాలో యువకులకు కన్నీటి వీడ్కోలు
- హాజరైన ఎమ్మెల్యే భూపతిరెడ్డి



అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి: గోదావరిలో పుణ్యస్నానాలకు వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన ముగ్గురు యువకుల అంత్యక్రియలను మండలంలోని గన్యాతండాలో అశ్రునయనాల మధ్య నిర్వహించారు. సాయినాథ్‌, లోకేశ్‌, మున్నా శ్రీరాంసాగర్‌ కాలువలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. వారి అంత్యక్రియలను శనివారం నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అంతిమయాత్రలో ఎమ్మెల్యే భూపతిరెడ్డితోపాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే అన్నారు.

మొండికేస్తున్న గేట్లు



మ్యానువల్‌గా గేట్లను దించుతున్న సిబ్బంది

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి లక్ష్మి కాలువకు నీటిని విడుదల చేసే గేట్లను ఎత్తాలన్నా.. దించాలన్నా సిబ్బందికి నరకం కనిపిస్తోంది. శుక్రవారం లక్ష్మి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ సమీపంలో ముగ్గురు యువకులు గల్లంతు కాగానే గాలింపు చర్యలను ప్రారంభించారు. ఆ సమయంలో నీటి విడుదలను నిలిపివేసేందుకు కాలువ గేట్లను దించేందుకు ప్రయత్నించిన సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు సైతం గేట్లను దించేందుకు ప్రయత్నించారు.

విద్యుత్‌ సరఫరా లేక ఇబ్బందులు

2017లో లక్ష్మికాలువ ఆధునికీకరణకు కేటాయించిన రూ.20 కోట్ల బడ్జెట్‌లోనే గేట్ల ఆపరేటింగ్‌ను ఎలక్ట్రిక్‌ విధానంలో చేయించాలని పేర్కొన్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్‌ విద్యుత్‌ సరఫరాతో గేట్లను ఎత్తేలా, దించేలా పనులు పూర్తి చేశారు. అయితే, గేట్ల ఆపరేటింగ్‌కోసం విద్యుత్‌ సరఫరాను లక్ష్మి కాలువ ఎత్తిపోతల పథకం నుంచి తీసుకున్నారు. ప్రస్తుతం ఆ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ పని చేయకపోయినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో.. అత్యవసర పరిస్థితుల్లో గేట్లు దించేందుకు సిబ్బందికి ఇబ్బందులు తప్పడం లేదు. లిఫ్టు పనులు చేపట్టిన కంపెనీ ఇప్పటి వరకు లిఫ్టుతోపాటు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ను సంబంధిత శాఖకు అప్పగించలేదని అధికారులు తెలుపుతున్నారు.

ఏజెన్సీకి విన్నవించాం

లక్ష్మి ఎత్తిపోతల పథకం విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో గల ట్రాన్స్‌ఫార్మర్‌ మరమ్మత్తులు చేపట్టాలని పలు మార్లు సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు విన్నవించాం. చేపడుతామని తెలుపుతున్నారు. ప్రస్తుతం లిఫ్టు అవసరం ఏర్పడే పరిస్థితి ఉంది. వెంటనే చేపట్టాలని ఆదేశించాం.

– సురేశ్‌, డిప్యూటీఈఈ, మైనర్‌ ఇరిగేషన్‌, బాల్కొండ

అన్యాయం జరిగింది.. ఆదుకోండి

- కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ నర్సింగ్‌ ఆఫీసర్ల వేడుకోలు
- విధుల్లో నుంచి ఇటీవల తొలగింపు
- ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు

నిజామాబాద్‌నాగారం: కరోనా విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి సేవలందించిన తమకు గుర్తింపు లేకుండాపోయిందని కాంట్రాక్ట్‌, అవుట్‌ సోర్సింగ్‌ నర్సింగ్‌ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రి(జీజీహెచ్‌) నుంచి తమను తొలంగించారని అంటున్నారు. న్యాయం చేయాలని కలెక్టర్‌కు, ఉన్నతాధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు.

నిజామాబాద్‌ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు ఆరు సంవత్సరాల క్రితం కాంట్రాక్టు ప్రాతిపదికన ఎనిమిది మంది, అవుట్‌సోర్సింగ్‌ పద్ధతిలో తొమ్మిది మంది విధుల్లో చేరారు. కరోనా ఫస్ట్‌, సెకండ్‌ వేవ్‌లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించారు. ఇళ్లలో కుటుంబ సభ్యులు, చిన్నచిన్న పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నా పక్కాగా విధులు నిర్వహించారు. అయితే, ఇటీవల డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ద్వారా నర్సింగ్‌ ఆఫీసర్‌ పోస్టుల్లోకి రెగ్యులర్‌ ఉద్యోగులు వచ్చేశారు. జీజీహెచ్‌లో కాంట్రాక్ట్‌, అవుట్‌సోర్సింగ్‌ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న 112మందికి రెగ్యులర్‌ ఉద్యోగాలు రాగా, ఆరేళ్ల క్రితం రిక్రూట్‌ అయిన 17మందికి రాకపోగా, పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. ఇందులో నాలుగు పోస్టులు ఖాళీ ఉండగా, ఈ 17మందిలో నుంచి నలుగురిని విధుల్లోకి తీ సుకున్నారు. నియామకంలో ఎలాంటి సీనియార్టీ పాటించలేదని ఆవేదన చెందుతున్నారు.

కలెక్టర్‌కు వేడుకోలు

జిల్లా కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఇప్పటికే వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులను, జిల్లా అధికారులను సైతం కలిసి తమకు జరిగిన అన్యాయంపై వివరించారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించామన్నారు. వైద్యారోగ్యశాఖ ద్వారా చేపట్టే నియామకాల్లోనైనా తమకు న్యాయం చేయాలని విన్నవించారు. వైద్యారోగ్యశాఖలో ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం ఖాళీలను భర్తీ చేయనున్న నేపథ్యంలో తాము దరఖాస్తు చేసుకున్నామని, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విధుల్లో నుంచి తొలగించబడ్డ నర్సింగ్‌ ఆఫీసర్లు (ఫైల్‌)

నిర్ణయించేది ఎలక్షన్‌ కమిషనే..

- త్వరలో ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నిక

ఆర్మూర్‌: మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పండిత్‌ వినీతపై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ నోటిఫై చేయడంతో, చైర్‌పర్సన్‌ ఎన్నిక వ్యవహారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ పరిధిలోకి వెళ్లింది. వరుస సెలవుల కారణంగా ఆలస్యమైనప్పటికీ.. త్వరలోనే మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ ఎన్నికకు నోటిఫికేషన్‌ జారీ అయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒకవేళ పార్లమెంట్‌ ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడితే మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నిక సైతం ఆలస్యమవుతుందని మొదట అందరూ భావించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం జీజారీ చేయడం, రాజపత్రంలో నోటిఫై చేయడం అన్నీ పార్లమెంట్‌ ఎన్నికల నోటిఫికేషన్‌ వెలువడడానికి ముందే జరిగిన పరిణామాలు కావడంతో చైర్‌పర్సన్‌ ఎన్నికపై ప్రభావం ఉండదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌ నాయకులు రెట్టించిన ఉత్సాహంతో ఆర్మూర్‌ మున్సిపాలిటీపై జెండా ఎగురవేయడానికి పావులు కదుపుతున్నారు. మరోవైపు సోమవారం ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌ షేక్‌ మున్ను అధ్యక్షతన మున్సిపల్‌ బడ్జెట్‌ సమావేశాన్ని నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రామారావు మహరాజ్‌కు భారతరత్న ప్రకటించేలా కృషి

- సమాజసేవతోపాటు సనాతన ధర్మాన్ని సద్గురు పాటించారు
- ఎంపీ ధర్మపురి అర్వింద్‌
- 100 మహరాజ్‌ విగ్రహాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్‌

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): సద్గురు రామారావు మహారాజ్‌కు భారతరత్న ప్రకటించేలా, ఆయన విగ్రహం బాసరలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్‌ పేర్కొన్నారు. నగరశివారులోని బోర్గాం(పి)లో ఉన్న మోటాటిరెడ్డి కళ్యాణమండపంలో అర్వింద్‌ ధర్మపురి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు 100 రామారావు మహారాజ్‌ విగ్రహాలను ఎంపీ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి పౌరాదేవి నుంచి శేఖర్‌ మహారాజ్‌, జితేందర్‌ మహారాజ్‌, కబీర్‌దాస్‌ మహారాజ్‌తోపాటు నిజామాబాద్‌ అర్బన్‌, ఆర్మూర్‌ ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ కులాచారి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్వింద్‌ మాట్లాడుతూ.. రామారావు మహారాజ్‌ జీవితాంతం సమాజంతోపాటు సనాతన ధర్మానికి సేవ చేసుకున్నారని గుర్తుచేశారు. 12 ఏళ్లపాటు మౌనవ్రతం పాటించి దైవానుగ్రహం, దైవ శక్తిని పొందారన్నారు. రామారావు మహారాజ్‌ విగ్రహాలు వితరణ చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశానికి దేవుడు ఇచ్చిన అనుగ్రహమని రామారావు మహారాజ్‌ చెప్పినట్లు ఎంపీ గుర్తుచేసుకున్నారు. మహారాజ్‌ను ఎప్పుడు కలిసినా తండ్రిలా ఆశీర్వాదం ఇచ్చేవారని, సేవాలాల్‌ మహారాజ్‌ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలని పార్లమెంట్‌లో మాట్లాడానని గుర్తు చేశారు. రామారావు మహారాజ్‌ ఆశీర్వాదంతోనే ఎంపీనయ్యాయని పేర్కొన్నారు. అంతకుముందు ఎంపీ అర్వింద్‌ లంబాడా మహిళలతో కలిసి నృత్యం చేశారు. రామారావు మహారాజ్‌ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం భోగ్‌బండార్‌ నిర్వహించి ముఖ్యఅతిథులను సన్మానించారు.

ధర్మం, అధర్మం మధ్య ఎన్నికలు

దేశంలో ధర్మానికి, అధర్మానికి మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ పేర్కొన్నారు. రామారావు మహారాజ్‌ హిందూ ధర్మం కోసం పని చేసే వారికి, పార్టీలకు ఆశీర్వాదం ఇచ్చారన్నారు. సేవాలాల్‌ మహారాజ్‌, రామారావు మహారాజ్‌ ఆశయాలకు అనుగుణంగా మోదీ పాలన సాగిస్తున్నారన్నారు. ధర్మం, అధర్మం మధ్య జరిగే ఎన్నికల్లో గిరిజన సమాజం ధర్మం వైపు నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

హిందువులకు గిరిజనలంబాడీలే ఆదర్శం

హిందువులకు గిరిజనలంబాడీలే ఆదర్శమని, మసీదులు, చర్చీలులేని ప్రదేశాలు కేవలం తండాలు మాత్రమేనని ఆర్మూర్‌ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. రామారావు మహారాజ్‌ ఆశయాలు, ఆదర్శాలు ముందుకు తీసుకెళ్లాలని, ధర్మాన్ని ఎలా సజీవంగా ఉంచాలో గిరిజనుల వద్ద నేర్చుకోవాలన్నారు. ధర్మాన్ని కాపాడే ఏకైక పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. బంజారా నాయకులు బద్యా నాయక్‌, డాక్టర్‌ బిలోజీ నాయక్‌, పూజారుల సంఘం అధ్యక్షుడు రమేశ్‌మహారాజ్‌, బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కిషన్‌నాయక్‌, ఎంపీపీ గద్దె భూ మన్న, పద్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్‌, రాంసింగ్‌నాయక్‌, నరేందర్‌, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

గోదావరిలో పడి మేస్త్రి మృతి



కొండబోయి మాధవ్‌ మృతదేహం

నందిపేట్‌ (ఆర్మూర్‌): నందిపేట మండలంలోని ఉమ్మెడ గ్రామ శివారులో గోదావరి నదిలో పడి తాపీమేస్త్రి కొండబోయిన మాధవ్‌ (30) మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా కలిగిరి మండలానికి చెందిన కొండబోయిన మాధవ్‌ గత కొన్ని సంవత్సరాలుగా నిర్మల్‌ జిల్లా లోకేశ్వర్‌ మండలం వట్టోలి గ్రామంలో ఉంటూ మేస్త్రి పని చేస్తున్నాడు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గోదావరి నదీ తీరంలోని ఉమ్మెడ ఉమామహేశ్వర ఆలయం జాతరకు తన మిత్రుడు కర్ర రమేశ్‌తో కలిసి వచ్చాడు. ఆలయం వెనుక ప్రాంతంలోని గోదావరిలో కాళ్లు, చేతులు కడుక్కోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటికి తీయించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి..

- మృతుడు కర్నూలు వాసి..

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో ఈనెల 7వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తాపీమేస్త్రి కంచర్ల రమేశ్‌(38) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌ జిల్లా ఆత్మకూర్‌ మండలం నల్లకాలువ గ్రామానికి చెందిన రమేశ్‌ జన్నేపల్లిలో తాపీమేస్త్రిగా పని చేస్తున్నాడు. ఈనెల 7వ తేదీన రోడ్డువెంబడి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్‌ ఢీకొట్టింది. తలకుతీవ్ర గాయాలు కావడంతో రమేశ్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నవీపేట: మండలంలోని జన్నేపల్లిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన భార్యాభర్తలు రచ్చ నవీన్‌, లయ మేనకోడలు చికితతో కలిసి బైక్‌పై శివాలయానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో బైక్‌ ఢీకొట్టిందన్నారు. నవీన్‌ కాలు విరుగగా, చికిత తలకు తీవ్రగాయాలయ్యాయని, బాధితులు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు.

పీడీఎస్‌ బియ్యం పట్టివేత

మాక్లూర్‌: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల పీడీఎస్‌ బియ్యాన్ని శనివారం ఉదయం పట్టుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. మోబీన్‌ అనే వ్యక్తి పీడీఎస్‌ బియ్యం వ్యాపారం చేస్తున్నాడని రేషన్‌ డీలర్లు ఫిర్యాదు చేయడంతో పీడీఎస్‌ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని మోబీన్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక టిప్పర్‌..

రాజంపేట: రెవెన్యూ పట్టాభూమిలో నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్‌ చేసినట్లు ఎఫ్‌ఆర్‌వో రమేశ్‌ శనివారం తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో ఇసుకను నిల్వచేసి అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం అందిందన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను (టీఎస్‌ 17టీ 9401)బస్వన్నపల్లి గ్రామ శివారులో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామన్నారు. దాడుల్లో బీట్‌ ఆఫీసర్లు బాబా, సురేశ్‌ పాల్గొన్నట్లు తెలిపారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు






మైలారంలో కుస్తీ పడుతున్న మల్లయోధులు

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలోని రాజరాజేశ్వర ఆలయంలో శనివారం శివరాత్రి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ సందర్భంగా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి ఆలయ కమిటీ సభ్యులు బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


నస్రుల్లాబాద్‌(బాన్సువాడ) : మండలంలోని సంగంలో ఆదివారం కుస్తీ పోటీలు జరగనున్నాయని ఎంపీపీ పాల్త్య విఠల్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాది కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుండి మల్ల యోధులు పాల్గొంటారన్నారు.

రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వే పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పూలాంగ్‌ వాగు రైల్వే ట్రాక్‌పై రైలుకు ఎదురెళ్లి గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 సంవత్సరాలు ఉంటుందని, వైట్‌ జీన్స్‌ ప్యాంటు, బ్లూ బ్లాక్‌ షర్ట్‌ ధరించాడన్నారు. కుడి చేయిపై అమ్మ అనే పచ్చబొట్టు ఉందని తెలిపారు. పూర్తి వివరాలకు 87126 58591 నంబర్‌ను లేదా రైల్వే పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

బాలుడి అదృశ్యం



సల్మాన్‌ (ఫైల్‌)

నిజామాబాద్‌ రూరల్‌ : నగరంలోని మాలపల్లికి చెందిన సయ్యద్‌ సల్మాన్‌ (6) శనివారం అదృశ్యమైనట్లు రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌ తెలిపారు. చంద్రశేఖర్‌కాలనీలో ఉంటున్న తాతయ్య దగ్గరికి కుటుంబ సభ్యులతో కలిసిన వచ్చిన సల్మాన్‌, శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఆడుకుంటూ బయటికి వెళ్లి తిరిగి లేదని ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59849 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో కోరారు.